సాక్షి వైఎస్‌ఆర్ జిల్లా

ఆదివారం । 26 । మే । 2024



మదనపల్లెలో గ్యాంగ్ వార్

మదనపల్లె పట్టణంలోని మంజునాథ కాలనీ జగనన్న లే అవుట్‌లో బహుజన భీమ్‌సేన అధ్యక్షుడు పుంగనూరు శేషాద్రిని ప్రత్యర్థులు కత్తులతో నరికి చంపారు. - 8లో



మోహినీ అవతారంలో దేవదేవుడు

నారాపురస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణం శనివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. మోహినీ అవతారంలో స్వామి దర్శనం ఇచ్చారు. - 8లో

గరిష్టం/కనిష్టం
37.0/28.4

వాతావరణం

జిల్లాలో శనివారం 28.4 - 37.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

విజయం మనదే!

- పోలింగ్ ఫలితాలపై లెక్కలు వేసుకుంటున్న ప్రధాన పార్టీలు
- తమ స్థానాలు 'పది'లమంటున్న వైఎస్సార్‌సీపీ
- పరువు నిలుపుకుంటామంటున్న టీడీపీ
- జనసేన, బీజేపీ స్థానాల్లో గెలుపు అసాధ్యమే
- ఓటు బదిలీ కాలేదంటున్న రాజకీయ పరిశీలకులు
- వైఎస్సార్‌సీపీ ఖాతాలోకే కడప, రాజంపేట పార్లమెంటు స్థానాలు

సాక్షి ప్రతినిధి, కడప: ఐదేళ్లకోసారి వచ్చే ఓట్ల పండుగలో ఓటర్లు పోటాపోటీగా పాల్గొన్నారు. ప్రజా తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. ఫలితం కోసం జూన్ 4వరకు వేచి ఉండక తప్పదు. అయినప్పటికీ ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. మేమే గెలుస్తామంటూ ఎవరికి వారు ఆత్మవిశ్వాసం ప్రదర్శిస్తున్నారు. బూత్‌ల వారీగా ఓట్లు గణన చేస్తున్నారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని పది సీట్లు పదిలమని వైఎస్సార్‌సీపీ విశ్వాసం వ్యక్తం చేస్తుండగా, పరువు నిలుపుకునే స్థాయిలో సీట్లు దక్కుతాయని తెలుగుదేశం పార్టీ భావిస్తోంది. ఓటు బదిలీపై ఆశలు పెట్టుకున్న జనసేన, బీజేపీలకు అందని ద్రాక్ష పుల్లన అన్నట్లుగా నిరాశే మిగలనుంది. కాగా, కడప, రాజంపేట పార్లమెంటు స్థానాలు వైఎస్సార్‌సీపీ ఖాతాలో మరోమారు జమ కానున్నాయి.

ఎన్నికల పొత్తులో భాగంగా తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీలు ఏకమై తలపడ్డాయి. ఆ కారణంగానే ముందంజలోకి వచ్చామని టీడీపీ భావిస్తుండగా అదే పొత్తు ప్రతిబంధకంగా మారిందని వైఎస్సార్‌సీపీ అంచనా వేస్తోంది. పైగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిని చేసి ముప్పేట దాడి చేయడం కూడా జిల్లా వాసులకు మింగుడు పడలేదని తెలుస్తోంది. దీంతో జిల్లాలో ఉన్న సంప్రదాయ ఓటర్లు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు తమకు అండగా నిలిచారని వైఎస్సార్‌సీపీ సంపూర్ణ విశ్వాసం ప్రకటిస్తోంది. ఈ క్రమంలో అన్ని స్థానాలు పదిలపర్చుకుంటామని మరోమారు 2019 ఫలితాలు పునరావృతం కాగలవని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కడప, రాజంపేట పార్లమెంటు స్థానాలతో పాటు 10 శాసనసభ స్థానాలు వైఎస్సార్‌సీపీ ఖాతాలోనే జమ కానున్నట్లు పలువురు వివరిస్తున్నారు.

ఖాతా తెరుస్తాం.. పరువు నిలుపుకుంటామంటున్న టీడీపీ

గత ఎన్నికల్లో జిల్లాలో ఒక్క సీటు కూడా టీడీపీకి దక్కలేదు. అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో ఖాతా తెరుస్తాం, పరువు నిలుపుకునే స్థాయిలో సీట్లు సాధిస్తామని టీడీపీ నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, రాయచోటి అసెంబ్లీ స్థానాల్లో గట్టి పోటీ ఇచ్చామని చెప్పుకొస్తున్నారు. మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ వరుసగా ఓడిపోయిన నేపథ్యంలో ఈమారు అనుకూలత ఉందని టీడీపీ భావిస్తోంది. పుట్టా సుధాకర్‌యాదవ్ ఎన్నికల సమయంలో మినహా స్థానికంగా లేకపోవడంతో పాటు రెడ్డి, ముస్లిం, క్రిష్టియన్ మైనార్టీ, ఎస్సీ ఓటర్లు వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచారని గెలుపు అసాధ్యమని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. కమలాపురంలో టీడీపీ అభ్యర్థిగా పుత్తా నరసింహారెడ్డి వరుసగా పరాజయం పాలయ్యారు. ఈమారు సానుభూతితో గట్టెక్కగలమని ఆ పార్టీ నేతలు చెప్పుకొచ్చారు. తీరా అభ్యర్థిత్వం పుత్తా నరసింహారెడ్డికి కాకుండా ఆయన తనయుడు కృష్ణచైతన్యరెడ్డికి కేటాయించారు. పైగా టీడీపీ విజయం కోసం పనిచేస్తారని భావించిన మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి, కాశీభట్ల సాయినాథశర్మ ఇరువురు వైఎస్సార్‌సీపీలో చేరిపోయారు. ఈక్రమంలో మెజార్టీ తథ్యమని భావించిన కమలాపురం మండలంలో టీడీపీకి భారీగా గండి పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



పార్లమెంటు అభ్యర్థుల విజయం ఏకపక్షమే..

కడప, రాజంపేట వైఎస్సార్‌సీపీ పార్లమెంటు ఫలితాలు ఏకపక్షంగా ఉండనున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. కడప ఎంపీ పరిధిలో 1989 నుంచి వైఎస్ కుటుంబం ఆధిపత్యమే కొనసాగుతోంది. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తొలిసారి ఎంపీ అయ్యింది మొదలు ఇప్పటి వరకూ ఆ కుటుంబ సభ్యులే ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా 2014లో తొలిసారి పోటీ చేసిన వైఎస్ అవినాష్‌రెడ్డికి 55.95 శాతం ఓట్లు లభించాయి. అప్పట్లో 1,90,323 ఓట్లు మెజార్టీ లభించగా, రెండవసారి 2019లో 63.79 శాతం ఓట్ల శాతంతో 3,80,726 ఓట్ల మెజార్టీ దక్కింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మరోమారు పోటీ చేసిన ఆయన హ్యాట్రిక్ విజయం సొంతం చేసుకోనున్నట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిల డిపాజిట్లు కోల్పోనున్నట్లు పరిశీలకుల అభిప్రాయం. రాజంపేట నుంచి ఇప్పటికే వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా రెండుసార్లు విజయం సాధించిన పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సైతం ఈమారు హ్యాట్రిక్ విజయం దక్కించుకోనున్నట్లు స్పష్టమవుతోంది. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో మిథున్ రెడ్డికి భారీ మెజార్టీ దక్కనున్నట్లు పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఏది ఏమైనా ప్రధాన పార్టీలైన వైఎస్సార్‌సీపీ, తెలుగుదేశం పార్టీలు మాత్రం గెలుపు విషయంలో ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తుండటం విశేషం.

కడపలో టీడీపీకి నిరాశే..

కడప అసెంబ్లీపై తెలుగుదేశం పార్టీ భారీ ఆశలు పెట్టుకుంది. ఈ క్రమంలో అనేక వివాదాస్పద వ్యవహారాలు తెరపైకి వచ్చాయి. మత విద్వేషాలను పురిగొల్పారు. సామాజిక సమీకరణల్లో భాగంగా అనేక ఎత్తుగడలను అవలంబించారు. ముస్లిం మైనార్టీల ఓట్లు చీల్చేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మైనార్టీ నాయకున్ని తెరపైకి తెచ్చారు. ఎన్నికల ముందు ఏమేమి చేయాలో అన్ని రకాలుగా చేశారు. అయినప్పటికీ 65.27 శాతం మాత్రమే ఓటింగ్ నమోదైంది. మొత్తం ఓటర్లలో సుమారు 33శాతం పైగా ముస్లిం మైనార్టీ ఓటర్లు ఉన్నారు. ముస్లిం మైనార్టీ, క్రిష్టియన్ మైనార్టీ, ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలు ఏకపక్షంగా వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచారని ఆ పార్టీ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. రెడ్డి సామాజికవర్గంలో, వలస వచ్చిన వారిలో, కాపు సామాజికవర్గంలో టీడీపీకి కాస్త సానుకూలత లభించినట్లు పలువురు వివరిస్తున్నారు. ఎటుచూసినా టీడీపీకి గెలుపు అంత సులువు కాదనే విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

సన్నగిల్లిన వరద ఆశలు...

మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అభ్యర్థిత్వం ఖరారైనప్పటి నుంచి ప్రొద్దుటూరుపై టీడీపీ ఆశలు పెట్టుకుంది. ఈమారు విజయకేతనం ఎగురవేస్తామనే ధీమాను ఆ పార్టీ నేతలు వ్యక్తం చేస్తూ వచ్చారు. ఎన్నికలు సమీపించే కొద్దీ వారి ఆశలకు తూట్లు పడ్డాయి. పోలింగ్‌లో మహిళలు గణనీయంగా పాల్గొనడంతో మరింతగా చచ్చుబడిపోయారని పరిశీలకులు వెల్లడిస్తున్నారు. గతంతో పోలిస్తే దాదాపు 2.6 శాతం ఓటింగ్ పెరిగింది. సంక్షేమ పథకాల లబ్ధిదారులు, కొత్త ఓటర్ల కారణంగా ఓటింగ్ పెరిగిందని దీంతో మరోమారు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రాచమల్లు ప్రసాదరెడ్డి విజయం సాధిస్తున్నట్లు ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాయచోటిలో ఇలాంటి ఆశలే పెట్టుకున్న టీడీపీకి ముస్లిం మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లు ప్రతిబంధకంగా నిలిచినట్లు పరిశీలకులు వెల్లడిస్తున్నారు. జమ్మలమడుగులో బీజేపీ అభ్యర్థి ఆదినారాయణరెడ్డి గట్టిపోటీకి మాత్రమే పరిమితం అయ్యారని, ఓటు బదిలీ ఆశించిన స్థాయిలో కాలేదని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి విజయానికి ఢోకా లేదని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

కౌంటింగ్ సిబ్బందికి విధుల కేటాయింపు

జిల్లా ఎన్నికల అధికారి విజయ్ రామరాజు

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణ కోసం మొత్తం 1035 మంది కౌంటింగ్ సిబ్బందికి మొదటి విడత ర్యాండమైజేషన్ ద్వారా విధులను కేటాయించామని జిల్లా ఎన్నికల అధికారి విజయ్ రామరాజు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ హాలులో జేసీ గణేష్ కుమార్, జిల్లా ఎలెక్షన్ కంట్రోల్ రూమ్ ప్రత్యేక పర్యవేక్షకులు, కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, డీఆర్‌ఓ గంగాధర్ గౌడ్‌లతో కలిసి కౌంటింగ్ సిబ్బందికి విధులను కేటాయించే మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ నిర్ణయించిన ప్రకారం కౌంటింగ్ సిబ్బందికి నియామక ఉత్తర్వులను సంబంధిత తహసీల్దార్ల ద్వారా అందిస్తామన్నారు. కౌంటింగ్ సిబ్బందికి కడప నగరం అన్నమయ్య సర్కిల్‌లోని మునిసిపల్ కార్పొరేషన్ మెయిన్ హైస్కూల్‌లో ఈనెల 29న ఉదయం 9 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన శిక్షణను ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణా తరగతులకు గైర్హాజరు అయిన సిబ్బందిపై ప్రజాప్రాతినిధ్య చట్టం -1951 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొదటి ర్యాండమైజేషన్ ద్వారా విధులను కేటాయించిన వారికి జూన్ 2వ తేదీన రెండవ ర్యాండమైజేషన్, జూన్ 4వ తేదీన ఉదయం 5 గంటలకు 3వ ర్యాండమైజేషన్ నిర్వహించి వారు ఏ టేబుల్‌లో కౌంటింగ్ నిర్వహించాలో తెలియజేస్తామన్నారు. అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతోపాట సీపీవో వెంకట్రావు, డీఐఓ విజయ్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కేవీకేలో నూతన వ్యవసాయ పంచాంగాలు

- కేవీకే కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎ. వీరయ్య

కడప అగ్రికల్చర్: కడప నగరశివార్లలోని ఊటకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో 2024–25వ సంవత్సరానికిగాను నూతన వ్యవసాయ పంచాంగాలు అందుబాటులో ఉన్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎ. వీరయ్య తెలిపారు. ఈ వ్యవసాయ పంచాగంలో వివిధ వ్యవసాయ పంటలలో మేలైన యాజమాన్య పద్ధతుల గురించి నవీకరించిబడిన సమగ్ర సమాచారం ఉందని పేర్కొన్నారు. ఈ వ్యవసాయ పంచాంగం వెల ఒకటి రూ. 270గా నిర్ణయించినట్లు తెలిపారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లా రైతులు, వ్యవసాయ విస్తరణాధికారులు ఈ అవకాశాన్ని సదినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

కడప అన్నమాచార్య కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివారులో స్వయంప్రతిపత్తి గల అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ గుర్తింపు లభించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధినేత డాక్టర్ చొప్పా గంగిరెడ్డితో కలిసి ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ 5వ తేదీ నుంచి మూడు రోజులపాటు ఎన్‌బీఏ బృందం కళాశాలలో పర్యటించి అక్కడ అమలవుతున్న విద్యా విధానాలు, ఫలితాలు, ప్లేస్‌మెంట్స్, అధ్యాపకులు, పరిశోధన విభాగాలు, మౌలిక సౌకర్యాలు, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను పరీక్షించింది. ట్రిపుల్‌ఈ, ఈసీఈ, సీఎస్‌సీ విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపును ప్రధానం చేశారన్నారు. తమ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు రావడంతో విద్యా సంస్థల వైస్ చైర్మన్ చొప్పాయల్లారెడ్డి, ఈడీ చొప్పాఅభిషేక్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులను అభినందించారు.

మదనపల్లెలో గ్యాంగ్ వార్

- ప్రత్యర్థుల దాడిలో పుంగనూరు శేషాద్రి దారుణ హత్య
- భార్య, కుమార్తె కళ్లెదుటే కిరాతకంగా నరికిన దుండగులు
- ఆధిపత్యపోరులో భాగంగానే హత్య జరిగిందన్న డీఎస్పీ

భార్య, కుమార్తె చంపవద్దంటూ కాళ్లా వేళ్లా పడి వేడుకున్నా.. కనికరం లేని కిరాతకులు వారి కళ్లెదుటే హతమార్చారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో దారుణం చోటుచేసుకుంది. వర్గాల ఆధిపత్య పోరుకు ప్రత్యర్థులు కలబడి బహుజన భీమ్‌సేన అధ్యక్షుడు పుంగనూరు శేషాద్రిని కిరాతకంగా నరికి చంపేశారు. ఒళ్లు గగుర్పొడిచే ఈ ఘటనతో పట్టణవాసులు ఉలిక్కిపడ్డారు.



పుంగనూరు శేషాద్రి (ఫైల్)

మదనపల్లె : ఆధిపత్య పోరులో ప్రత్యర్థుల చేతిలో ఒకరు దారుణ హత్యకు గురికావడం కలకలం రేపింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని 2వ వార్డు మంజునాథ కాలనీ జగనన్న లే అవుట్‌లో బహుజన భీమ్‌సేన అధ్యక్షుడు పుంగనూరు శేషాద్రి(35) నివసిస్తున్నాడు. శేషాద్రి లారీడ్రైవర్‌గా పనిచేస్తున్న సమయంలో కలకత్తాకు చెందిన కమలను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి కుమార్తె రెడ్డి మహేశ్వరి ఉంది. కమలకు తెలుగు సరిగా రాదు. రాత్రి 11 గంటల సమయంలో గొల్లపల్లె దళిత వాడకు చెందిన కొండుపల్లి ఆనంద్, అతడి అనుచరులు చరణ్, మణికంఠ, చెన్నారెడ్డి, కొందరు లావాదేవీల విషయమై చర్చించాలని మిద్దె పైకి తీసుకెళ్లారు. మాటా మాటా పెరిగి వివాదం తలెత్తడంతో శేషాద్రిపైనా కత్తులతో దాడికి పాల్పడ్డారు. చేతి వేళ్లు అడ్డుగా పెట్టడంతో తెగి కిందపడ్డాయి. ప్రాణ భయంతో శేషాద్రి వారి నుంచి తప్పించుకుని మిద్దెపైనుంచి ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. దుండగులు తలుపులు పగల గొట్టి బెడ్ రూమ్‌లో దాక్కున్న శేషాద్రిని హాల్ లోకి లాక్కొచ్చారు. తన భర్తను చంపవద్దని శేషాద్రి భార్య కమల, కూతురు రెడ్డిమహేశ్వరి వేడుకుంటున్నా.. అరిస్తే చంపేస్తామని బెదిరించారు. వారి కళ్లెదుటే శేషాద్రిని విచక్షణా రహితంగా నరికి చంపారు. భర్తను కళ్లముందే చంపేయడంతో కమల షాక్‌కు గురైంది. కొద్దిసేపటి తర్వాత తేరుకుని రోదిస్తూ పోలీసులకు హిందీలో వివరించడం కలచివేసింది. స్థానికుల సమాచారం మేరకు డీఎస్పీ ప్రసాదరెడ్డి, సీఐలు వలీబాషా, యువరాజు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. భార్య కమల ఫిర్యాదు మేరకు కొండుపల్లె ఆనంద్, చరణ్, మణికంఠ, చెన్నారెడ్డిలతో పాటు ఆరుగురిపై ప్రాథమికంగా హత్యకేసు నమోదుచేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఆధిపత్య పోరులో భాగంగానే శేషాద్రి హత్య జరిగిందని, ఇందులో రాజకీయకోణం లేదని ఆయన స్పష్టం చేశారు.

పోలీసుల అదుపులో నలుగురు?

హత్యకు కుట్రదారుగా భావిస్తున్న కొండుపల్లె ఆనంద్ 2014, 2020లో జరిగిన రెండు హత్యకేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్నాడని డీఎస్పీ తెలిపారు. శేషాద్రి హత్యకేసులో దోషులు ఎంతమంది పాల్గొన్నారనే విషయమై లోతుగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితుల కోసం ప్రత్యేక గాలింపు బృందాలను ఏర్పాటుచేశామన్నారు. శనివారం ఉదయం శేషాద్రి ఇంటికి డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం వెళ్లి ఆధారాలు సేకరించారు. అయితే హత్యచేసిన తర్వాత నలుగురు నిందితులు నేరుగా టూటౌన్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం. ఆ సమయంలో వినియోగించిన ఏపీ-04ఏఎఫ్-5733 నెంబర్ ఇన్నోవా వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. నిందితులు లొంగిపోవడంపై పోలీసులు ఎలాంటి నిర్ధారణ చేయలేదు.



దారుణహత్యకు గురైన పుంగనూరు శేషాద్రి మృతదేహం



శేషాద్రి ఇంటిలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం



శేషాద్రి భార్య కమల, కుమార్తె రెడ్డి మహేశ్వరి

ఆధిపత్యం కోసమే హత్య

పుంగనూరు శేషాద్రి, కొండుపల్లె ఆనంద్ ప్రజా సంఘాల్లో సభ్యులుగా పనిచేస్తున్నారు. కొండుపల్లె ఆనంద్ ప్రధాన అనుచరుడిగా ఉన్న శేషాద్రి చిన్న దందాలు, సెటిల్మెంట్లు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొన్నేళ్ల కిందట శేషాద్రి మదనపల్లె ఎమ్మెల్యేకు పీఏ తానేనని చెబుతూ ఉద్యోగాలిప్పిస్తానని నిరుద్యోగులను మోసం చేసినట్లు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో అతడిపై 420 కేసు నమోదైంది. అనంతరం శేషాద్రి తన మకాం మంజునాథ కాలనీకి మార్చాడు. ఇతరుల ప్రమేయం లేకుండా సొంతంగా ల్యాండ్ సెటిల్మెంట్ చేయడం మొదలుపెట్టాడు. ఆనంద్‌కు పోటీగా బహుజన భీమ్ సేనను స్థాపించి కాలనీలో పట్టు సాధించే ప్రయత్నం చేశాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 14న రామారావు కాలనీలో అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పాడు. దీంతో ఆనంద్, శేషాద్రి వర్గాల మధ్య ఆధిపత్య పోరు మొదలైంది. ఈ నేపథ్యంలోనే ఒకరినొకరు చంపేస్తామని బెదిరించుకోవడం, గొడవలు పడడం, సామాజిక మాధ్యమాల్లో పరస్పరం విమర్శించుకోవడం, పోలీస్ స్టేషన్‌లో రాజీప్రయత్నాలు జరగడం వెనువెంటనే జరిగిపోయాయి. దీంతో శేషాద్రిని మట్టుబెట్టేందుకు ఆనంద్ వర్గం పథకం వేసింది. ప్రత్యర్థుల నుంచి ప్రాణహాని ఉందని, శుక్రవారం రాత్రి శేషాద్రి టూటౌన్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అనంతరం ఆనంద్ వర్గీయుల చేతిలో అర్ధరాత్రి దారుణహత్యకు గురయ్యాడు.

ఘనంగా ఉరుసు ఉత్సవం



దర్గాలో పూల చాదర్ సమర్పిస్తున్న భక్తులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరంలోని రహమతుల్లావీధిలోని చాంద్ ఫిరా గుంబద్ దర్గాలో కొలువైన హజరత్ ఖ్వాజా బందా నవాజ్ సాహెబ్ రహమతుల్లా అల్లాహి ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. దర్గా ముతవల్లీ అమీరున్నీసా ఇంటి నుంచి గంధం కలశాన్ని ఫకీర్లు మేళతాళాలు, విన్యాసాలతో మధ్య దర్గాకు చేర్చారు. అనంతరం దర్గాలో ప్రార్థనలు నిర్వహించి గురువుల మజార్ వద్ద సమర్పించారు. అనంతరం ఫాతెహా చేసి ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. స్థానికులతోపాటు నగరంలోని వివిధ ప్రాంతాలకుచెందిన భక్తులు ప్రార్థనలు నిర్వహించారు. ప్రముఖ ఖవ్వాలీ గాయకుల కచేరీ భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రముఖులు అహ్మద్‌బాష, అమీర్‌బాబు తోపాటు భక్తులు పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం



గణేష్ (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరంలోని ఎర్రముక్కపల్లె పరిధిలోని బాల వికాస్ స్కూల్ వీధిలో నివాసముంటున్న శ్యాంభారావు గణేష్(15) ఈ నెల 19న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదదు. గాలించిన ఆచూకీ తెలియకపోవడంతో అతని తండ్రి వెంకటసుబ్బయ్య శనివారం కడప ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగస్వామి తెలియజేశారు. ఆచూకీ తెలిసిన వారు సీఐ: 9121100510, ఎస్ఐలు 9121100511, 9121100512 నెంబర్లలకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కేజీ సెట్ ఫలితాల విడుదల



కేజీసెట్ ఫలితాలను విడుదల చేసిన కందుల రాజేశ్వరి, చంద్ర ఓబుల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఈ నెల 1 ,2, 3వ తేదీలలో నిర్వహించిన కేజీ సెట్ ఫలితాలను కందుల గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరి శనివారం విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కేజీసెట్ పరీక్షకు 3900 మంది విద్యార్థులు హాజరుకాగా, మొదటి ర్యాంకు సాధించిన వారికి తమ కళాశాలలో ఉచిత విద్య, వసతి కల్పిస్తామని, రెండో ర్యాంకు సాధించిన వారికి వసతి కల్పిస్తామని తెలిపారు. కేఎల్‌ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా విద్యార్థినుల్లో మొదటి ర్యాంకు వారికి విద్య, వసతి, రెండో ర్యాంకు వారికి వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. కళాశాల వైస్ చెర్మెన్ మదన్‌మహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ వీఎస్‌ఎస్‌మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

తొండూరు : తొండూరు మండలం సంతకొవ్వూరు పంచాయతీ పరిధిలోని పోతలపల్లె గ్రామానికి చెందిన రైతు వడ్డమాని రామసుబ్బారెడ్డి విద్యుత్ షాక్‌తో శుక్రవారం రాత్రి మృతిచెందాడు. స్థానికుల వివరాల మేరకు.. తోట వద్ద పనులు చేస్తుండగా విద్యుత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. తొండూరు మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జి వైఎస్.మదన్‌మోహన్‌రెడ్డి, బండి రామమునిరెడ్డి, బాలగంగిరెడ్డి, గంగరాజు, గంగిరెడ్డి, తదితరులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని రామసుబ్బారెడ్డి కుటుంబీకులను పరామర్శించారు.



రామసుబ్బారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్ మధన్‌మోహన్‌రెడ్డి, తదితరులు

నోడల్ అధికారిగా డీఎస్పీ రమాకాంత్ నియామకం

కడప అర్బన్ : పశువుల, జంతువుల సంరక్షణ చట్టాల అమలుకు వైఎస్‌ఆర్ జిల్లాకు నోడల్ అధికారిగా కడప 'దిశ' డీఎస్పీగా ఎస్.రమాకాంత్‌ను నియమించారు. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాల ప్రకారం పశువులు, జంతువుల సంరక్షణ చట్టాల అమలు సక్రమంగా జరగడానికి ఎస్. రమాకాంత్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ తెలియజేశారు.

1200 బీరు బాటిళ్లు ధ్వంసం

చింతకొమ్మదిన్నె : కడప-రాయచోటి రహదారిలోని గువ్వలచెరువు ఘాట్ వద్ద జరిగిన ప్రమాదంలో 1200 బీరు బాటిళ్లు ధ్వంసమయ్యాయి. వైఎస్సార్ జిల్లా చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ సమాచారం మేరకు.. పాండిచ్చేరి నుంచి రాయపూర్‌కు బీర్లలోడుతో వెళ్తున్న లారీ ఘాట్ రోడ్డుకు రాగానే ఎదురుగా వస్తున్న సిమెంట్ ట్యాంకర్‌ను ఢీకొంది. దాదాపు 1200 బీరు బాటిళ్లు ధ్వంసమయ్యాయి. ఇరు లారీల డ్రైవర్లకు గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువు మట్టి తరలింపునకు అడ్డుకట్ట

బి.కోడూరు : మండలంలోని గోవిందాయపల్లె చెరువు నుంచి మట్టి తరలిస్తుండగా ఆయకట్టు రైతులు శనివారం అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు సంబంధించిన గుత్తేదారులు స్థానిక తెదేపా నాయకుల సహకారంతో కొద్ది రోజులుగా మట్టి తరలిస్తున్నారు. దీంతో గోతులు ఏర్పడితే.. వాటిలో నీరు నిల్వ ఉండి తమ పంటలకు అందకుండాపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చెరువు కాపాడాలని కోరారు.

బైకు అదుపుతప్పి ఒకరికి గాయాలు

పులివెందుల రూరల్ : పులివెందుల-కదిరి రోడ్డులోని కంపోస్టు యార్డు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో కిందపడి ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. సత్యసాయి జిల్లా మద్దన్నగారిపల్లెకు చెందిన గుజ్జల పోతులయ్య పులివెందులకు వచ్చి తిరిగి సొంత గ్రామానికి వెళ్తుండగా కదిరిరోడ్డులోని కంపోస్టుయార్డు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. పోతులయ్యకు గాయాలవడంతో స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

ఎర్రగుంట్ల : మండలంలోని తిప్పలూరు వ్యవసాయ పొలాల్లో రైతులు రామసుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, నరసింహారెడ్డిలకు చెందిన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీంతో రైతులు విద్యుత్తు, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కమలాపురం : మండలంలోని కంచన్నగారిపల్లె సమీపంలో పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా దాడులు చేసి మూడు ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు.

వైవీయూకు 'స్వర్ణం'

వైవీయూ : చెన్నై నగరంలోని తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీలో నిర్వహించిన ఆలిండియా అంతర్ విశ్వవిద్యాలయాల పవర్ లిఫ్టింగ్ 59 కిలోల విభాగంలో వైవీయూ విద్యార్థికి స్వర్ణపతకం లభించింది. ఈ నెల 20 నుంచి జరిగిన ఈ పోటీల్లో బద్వేలు నారాయణమ్మ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు చెందిన విద్యార్థి మురళీకృష్ణ ప్రథమస్థానంలో నిలిచి స్వర్ణపతకం కైవసం చేసుకున్నాడు. వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య అభినందించారు.

క్షణికావేశంలో ప్రాణాలు తీసుకోవద్దు

- రైల్వే రక్షక దళం సీఐ శ్రీనివాసులు
- మహిళను కాపాడిన ఆర్‌పీఎఫ్ పోలీసులు



అంజలిని భర్తకు అప్పగిస్తున్న ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : క్షణికావేశంలో ప్రాణాలు తీసుకోకుండా, ప్రతి సమస్యకు పరిష్కారం వెతుక్కోవాలని రైల్వే రక్షక దళం సీఐ శ్రీనివాసులు సూచించారు. ఆత్మహత్య చేసుకోబోతున్న ఓ మహిళను ఆర్‌పీఎఫ్ పోలీసులు కాపాడిన సంఘటన అనంతరం ఆయన మాట్లాడారు. తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన భర్త అశోక్‌కుమార్‌తో శుక్రవారం గొడవపడిన అంజలి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా, భర్త అశోక్ కుమార్ ఆమెను వెంబడించాడు. బాధితురాలు రేణిగుంట రాయలసీమ ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగి ఎక్కి వెళ్తుండగా.. ఆమెను కాపాడాలని అశోక్‌కుమార్ టోల్ ఫ్రీ నెంబర్ 139 (రైల్ మదత్)కు ఫోన్ చేశారు. వారు కడప ఆర్‌పీఎఫ్ పోలీసులకు విషయం చేరవేశారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్ కడపకు చేరుకోగానే ఆర్‌పీఎఫ్ పోలీసులు అంజలి కోసం గాలించారు. కడప రైల్వే స్టేషన్‌లో దిగి అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఆర్‌పీఎఫ్ పోలీసులు గుర్తించారు. ఈ విషయాన్ని అశోక్‌కుమార్‌కు తెలియజేయడంతో ఆయన శనివారం ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ శ్రీనివాసులు మహిళ ప్రాణాలు కాపాడిన ఎస్ఐ నాగభూషణం, కానిస్టేబుళ్లు గోవిందరెడ్డి, అతిరా, హరిలాల్ మీనాను అభినందించారు.

టీకాలతో వ్యాధి నిరోధక శక్తి

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్



మాట్లాడుతున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్

ప్రొద్దుటూరు క్రైం : చిన్న పిల్లలకు టీకాలు వేయిస్తే వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ తెలిపారు. జిల్లా ఆస్పత్రిలోని సమావేశ భవనంలో రాజుపాళెం, కామనూరు, కల్లూరు, ప్రొద్దుటూరు అర్బన్ ఉన్న వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలకు శిక్షణ ఇచ్చారు. ఉమామహేశ్వర కుమార్ మాట్లాడుతూ పుట్టిన బిడ్డ మొదలుకొని 15ఏళ్ల వరకు 13 రకాల వ్యాధులు రాకుండా పది టీకాలు వయస్సు ప్రకారం వేయాలన్నారు. ప్రతి బుధవారం, శనివారాల్లో సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో టీకాలు వేయనున్నట్లు చెప్పారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ మాట్లాడుతూ గర్భవతి అని తెలిసిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదుచేసి వారికి సేవలందించాలన్నారు. పోషకాహారం తీసుకోకపోవడంతో హెచ్‌బీ శాతం తగ్గి రక్తహీనతతో ఇబ్బంది కలుగుతోంన్నారు. కాన్పు అయిన తర్వాత పిల్లలకు జాగ్రత్తగా టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు హనీఫ్ బాబా, శివప్రసాద్‌రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మునిరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మోహినీ అవతారంలో దేవదేవుడు



మోహిని అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న దేవదేవుడు

జమ్మలమడుగు : నారాపురస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయ ప్రాంగణం శనివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. శనివారం ఉదయం భక్తులకు మోహినీ అవతారంలో స్వామి దర్శనం ఇచ్చారు. స్వామి కీర్తనలతో కోలాటం ఆడుతూ ప్రజలు ఘన స్వాగతం పలికారు. అదేవిధంగా రాత్రి గరుడ వాహనంపై స్వామిని కొలువుంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి కల్యాణం నిర్వహించనున్నారు. వారు ముందుగానే రూ.300 రూపాయలు కట్టి రసీదు పొందాలని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

అదనపు శిక్షణతో ఉద్యోగావకాశాలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : గ్రామీణ నిరుద్యోగ యువతకు వాద్వానీ ఫౌండేషన్ ద్వారా అందించిన ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ శిక్షణ అన్ని విధాలా ఉపయోగపడుతుందని జాబ్స్ జిల్లా మేనేజర్ వేణుమాధవ్ తెలిపారు. కడప నగర శివారులోని స్కిల్ కళాశాలలో నిరుద్యోగ యువకులకు కేస్ అనాలసిస్, టీమ్ వర్క్, ప్రెజెంటేషన్, లాగ్వేంజ్, ప్రాబ్లమ్ సాల్వింగ్, సాఫ్ట్ స్కిల్స్‌పై ఇచ్చిన శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఉత్తీర్ణులైన వారికి వాద్వాని, సీ-డ్యాప్ ద్వారా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. వేణుమాధవ్ మాట్లాడుతూ అభ్యర్థులు ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతూ భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో నిలబడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పృథ్వీరాజ్, రంగస్వామి, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు ముగ్గురు పోలీసు అధికారుల నియామకం

కడప అర్బన్ : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపును జూన్ 4న వైఎస్సార్ జిల్లాకు సంబంధించి కడప నగర శివార్లలోని మౌలానా అజాద్ ఉర్దూ యూనివర్సిటీలో నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అధికారులను నియమిస్తూ డీజీపీ హరీష్‌కుమార్ గుప్త ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీగా పనిచేస్తున్న జి. వెంకటరాముడును ఓట్ల లెక్కింపు పరిశీలకుడిగా ఈ జిల్లాకే నియమించారు. ఏసీబీ డీఎస్పీలుగా పనిచేస్తున్న జస్సీ ప్రశాంతి, ఎన్. సత్యానంద్‌లను పోలీసు శాఖతరపున అధికారులుగా నియమించారు.